# హక్కులు

బెంగుళూరు నించి మద్రాస్‌కి ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటులో వెడుతున్నాను. ఆ కూపేలో నేనూ, నా ఎదురు సీటులో - సూటులోవున్న ఒక పెద్దమనిషి.

జోలార్‌పేట రైల్వే స్టేషన్‌లో ఆయన ద్రాక్షపళ్లు కొన్నాడు. రైలు బయల్దేరగానే, పొట్లం విప్పదీసి - ద్రాక్షపండు ఒకటి నోట్లో వేసుకున్నాడు. గింజలు నోట్లో నించి పెదవుల మధ్యకు తీసుకువచ్చి, మా యిద్దరి కాళ్ల దగ్గర నేల మీద తుపుక్కున వుమ్మేశాడు.

అదిరిపడ్డాను. కాళ్లు కొంచెం ముందుకు లాక్కున్నాను.

మళ్లీ యింకొక ద్రాక్షపండు నోట్లో వేసుకుని, గింజలు ఈసారి నా కాళ్ల మీదే వుమ్మేశాడు.

ఆయన వేపు చూశాను. దీర్ఘంగా ఏదో పుస్తకం చదువుతున్నాడు. మళ్లీ యింకో ద్రాక్షపండు నోట్లో వేసుకున్నాడు.

అప్పుడే అన్నాను నెమ్మదిగా - ఇంగ్లీషులో - "చూడండి! ఆ ద్రాక్షపండు గింజలు ఇలా రైలు పెట్టెలో నా కాళ్ల మీద వుమ్మేయటం మంచి పద్ధతి కాదు. మీరు కిటికీ ప్రక్కనే కూర్చున్నారు. అలా కిటికీలో నించి బయటకు వుమ్మేయవచ్చు కదా-"

ఆయన పుస్తకంలో నించి తల పైకెత్తలేదు. మళ్లీ యింకొకసారి గింజలు వుమ్మేశాడు. ఈసారి కొంచెం దూరంగా ... కానీ రైలు పెట్టెలోనే.

"పోనీ - ఆ న్యూస్ పేపరు మీద వేసి - అంతా అయిన తర్వాత బయట పారేయవచ్చుకదా!" ఈసారి కూడా మర్యాదగానే అన్నాను.

ఆయన కోపంగా చూశాడు. ఆయన 'హక్కుల'ను నేను ఎదిరిస్తున్నందుకు, ఆయన కొంచెం ఆశ్చర్యం ప్రకటించినట్లు అనిపించింది.

ఆయన నోట్లో యింకో ద్రాక్ష పండు వేసుకున్నాడు. నేను కాళ్లు పైకెత్తి సీటు మీద పెట్టుకు కూర్చున్నాను.

★ ★ ★

రోడ్డు మలుపు తిరగ్గానే ఎదురుగుండా ఒక పెద్ద గుంపు కనపడింది సుబ్బారావ్‌కి. ఆఫీస్‌కి ఆలస్యంగా వెళ్లినా అడిగేవాడు లేడు కనుక, సోద్యం చూట్టం కోసం తనూ ఆ గుంపులో చేరాడు. అక్కడ ఒక రిక్షా అతను - దేశంలోని దరిద్రం అంతా అతనిలోనే వున్నట్టుంది - బక్కచిక్కి వున్నాడు. ప్రక్కనే ఒక పోలీసు - దేశంలోని సంపదనంతా దోచుకుని, తన పొట్టలో దాచుకున్నట్టున్నాడు - తొమ్మిది నెలల చూలాలిలా వున్నాడు. నిటారుగా నుంచుని అరుస్తున్నాడు రిక్షావాడి మీద. రిక్షావాడు ఏదో నెమ్మదిగా గొణుగుతున్నాడు. నిండు చూలాలిలావున్న పోలీసు, రిక్షావాడ్ని చేతిలో వున్న లాఠీతో ఎడాపెడా కొడుతున్నాడు. అందరూ సోద్యం చూస్తున్నారు. రిక్షావాడి కణతలు పగిలి, రక్తం చిమ్మింది.

"రారా దొంగ వెధవా స్టేషన్‌కి - నీ అంతు చూస్తాను" అని అరుస్తున్నాడు, నెలలు నిండిన పోలీసు. సోద్యం చూస్తున్న ఎవరూ ఎందుకు కొడుతున్నాడు అని కానీ, ఆ రిక్షావాడు ఏం చేశాడు అని కానీ అడగటం లేదు. సోద్యం చూడటం మాత్రం ఆపకుండా, నోరు తెరుచుకుని మరీ చూస్తున్నారు. సుబ్బారావ్ అడిగితే, ప్రక్కనే వున్న ఆయన, సుబ్బారావ్ చెవిలో నెమ్మదిగా అన్నాడు -- "రోజూ ఈ పోలీసు వెధవ - రిక్షావాళ్ల దగ్గర 'మామూలు' తీసుకుంటాడు. ఈరోజు ఈ రిక్షావాడు యివ్వనన్నాట్ట - అందుకని ..."

పోలీసు రిక్షావాడి నడ్డిమీద గట్టిగా కొట్టాడు లాఠీతో. లంచం తినటం స్వతంత్ర భారతదేశంలో తన 'హక్కు'అయినట్టూ, ఆ హక్కులను ఎదిరించిన దేశ ద్రోహులను శిక్షిస్తున్నట్టు.

☆ ☆ ☆

లక్ష్మీపురంలో అది ఖరీదయిన మంచి యిల్లు. బయట నించీ చూస్తే కనీసం పది పడక గదులూ - అరడజను బాత్రూములూ వున్న ఇల్లులాగా వుంది. సమయం ప్రొద్దున ఎనిమిది గంటలు అయింది. లక్ష్మీపురంలోని, లక్ష్మీ నిలయంలో నించీ, సదరు లక్ష్మిగారు

బయటకు వచ్చారు. ప్రక్కనే ఆవిడ కొడుకు రెండేళ్ల లక్ష్మీప్రసాద్. ఆవిడ బయటకు రాగానే, ప్రక్కింటి లావుపాటి పిన్నిగారు కూడా బయటకు వచ్చారు.

"నువ్వు వెళ్లి ఆ ప్రక్కన కూర్చోరా!" కుర్రాడితో అని, లక్ష్మిగారు పిన్నిగారిని చూసి- "ఆఁ! ఇప్పుడు చెప్పండి పిన్నిగారూ అమ్మలక్కల కబుర్లు!" అన్నారు.

కుర్రాడు నిక్కరు విప్పి, వాళ్లమ్మ మీద విసిరేసి, రోడ్డు ప్రక్కనే, ప్రకృతి దేవత బడిలో భద్రంగా కూర్చుని, తన కడుపు కదల్చుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడు, స్టీరియోఫోనిక్ సరౌండు సౌండులో "ఊఁ! ఊఁ!" అంటూ -

లక్ష్మీ నిలయంలోని ఆరు బాత్రూములూ - స్వతంత్ర భారతదేశంలో భావి పౌరులకు తల్లులు యిస్తున్న "హక్కులు" చూసి, మూతి మీద వేళ్లు వేసుకున్నాయి.

☆ ☆ ☆

"మా కులం ఆయన జిందాబాద్. మీ కులం ఆయన డౌన్ డౌన్" దాదాపు ఒక వంద మంది అరుచుకుంటూ వస్తున్నారు రోడ్డు మీద.

వాళ్లకు ఎదురుగుండా, యింకొక గుంపు వస్తున్నది. "మా కులం ఆయన వర్థిల్లాలి - మీ కులం ఆయన నశించాలి!" అని నినాదాలు చేస్తూ ఆవేశంతో వస్తున్నారు.

ఇద్దరూ 'మా' కులం వర్థిల్లాలి - 'మీ' కులం నశించాలి అంటున్నారు, కనుక, ఇద్దరూ 'మా' కులానికి చెందిన వారని అపార్థం చేసుకోవద్దు. ఇద్దరూ వేరు వేరు కులాల వాళ్లు - వాళ్ల కులం వర్థిల్లాలనీ, ఎదుటి వాళ్ల కులం నశించాలనీ, వాళ్లిద్దరూ చాల సహృదయాలతో అరుస్తున్నారన్నమాట.

ఇద్దరూ ఒకళ్ల దగ్గరకు ఒకళ్లు వచ్చారు. ఆవేశంతో నినాదాలు చేశారు. ఆవేశం పెరిగి కలబడి కొట్టుకోసాగారు. ప్రక్కనేవున్న పది షాపుల గాజు అద్దాలు పగిలిపోయాయి. నాలుగు తలకాయలు లేచిపోయాయి. మూడు బస్సులూ, ఆరు కార్లు, తొమ్మిది ఆటోలు తగలబడుతున్నాయి. ఆ మంటల మీదుగా వీస్తున్న గాలి, ఎదురు గుండా వున్న బిల్డింగ్‌ని తగలబెట్టి, యింకా ఓపిగ్గా అరుస్తున్న ఆ రెండు కులాల వారి 'హక్కుల'నూ కాపాడుతున్నది. అదే సమయంలో కోట్ల కొద్దీ విలువయిన దేశ సంపద - ప్రజల సొమ్మూ - ప్రభుత్వపు సొమ్మూ - తగలబడుతూ, దేశాన్ని ఆర్థికంగా యింకో అయిదేళ్లు వెనక్కినెడుతున్నది.

☆ ☆ ☆

"ఇది చాల మంచి సినిమా - పోయిన సంవత్సరం బహుమతి కూడా వచ్చింది - నువ్వు అమెరికా వెళ్లేలోపల చూస్తావని తెచ్చాను!" అన్నాడు రమేష్.

అందరం టి.వి. ముందర కూర్చున్నాం. రమేష్ వీడియో ఆన్ చేశాడు. టైటిల్స్ అవగానే, తెరని సగం దాకా కప్పేస్తూ వచ్చింది 'ఈటా' అడ్వర్టయిజ్‌మెంట్. కథను నడిపిస్తున్న పాత్రధారులు, కథ తెలియకుండా, 'ఈటా' బుడగల వెనుక దాక్కున్నారు. సినిమా వస్తున్నంతసేపూ, అడ్వర్టయిజ్‌మెంట్లు , తెరని సగం దాకా కప్పేస్తున్నాయి. మధ్య మధ్యలో మాత్రం సినిమా ఆపి, పూర్తి తెర మీద అడ్వర్టయిజ్‌మెంట్లు వేస్తున్నారు.

"ఈ అడ్వర్టయిజ్‌మెంట్లు సినిమాని చూడకుండా చేస్తున్నాయి - తెలుగు సినిమా

లన్నీయింతే - అందుకే నాన్నతో అంటాను - వీడియోలు వద్దు - సినిమా హాల్లో చూద్దామని' అంటున్నది అనిత నిరుత్సాహంతో.

హీరోతో అంటున్నది హీరోయిన్ తల్లి - "ఈ అమ్మాయి చిన్నప్పుడు మంగళగిరి తిరునాళ్లలో తప్పిపోయిన మా అమ్మాయి అయి వుండాలి. అమ్మాయి అరికాలిమీద పుట్టుమచ్చ వుందో లేదో చూడండి - పుట్టుమచ్చ వుంటే అది మా అమ్మాయే!" అన్నది.

హీరో నిద్రపోతున్న హీరోయిన్ కాలి మీద చీర కొంచెం ప్రక్కకు తొలిగించాడు. ఈలోగా భగవంతునికి అనుసంధానమైన అగరబత్తి తెరని, మూడు వంతులు కప్పేశింది. ఆ అమ్మాయి కాలి మీద పుట్టుమచ్చ వుందో లేదో మాత్రం తెలీలేదు.

"ఇదేమిట్రా - సెన్సారు వాళ్ల కుట్రలాగా వుంది!" అన్నాడు గౌతమ్, రమేష్‌తో.

క్రింద ఎడ్వర్టయిజ్‌మెంటు పోయి, తెర అంతా కనపడుతున్నది. అంటే ఇప్పుడు పూర్తి ఎడ్వర్టయిజ్‌మెంటు వస్తున్నదన్నమాట. "కాంచన్ కాదు మమ్మీ - కంచన్" అంటున్నదో చిన్నపిల్ల.

సినిమాని అద్దె కట్టి తెచ్చుకుని చూస్తున్న ప్రేక్షకులకు అక్కరలేని 'హక్కు'లు ప్రకటనదారులకు వున్నట్లున్నాయి.

☆ ☆ ☆

ఎక్కడ నించో ఒక మాంసపు ముక్కను తీసుకువచ్చింది తల్లి కుక్క. ప్రక్కనేవున్న నాలుగు కుక్క పిల్లలూ, సమిష్టిగా ఆ మాంసపు ముక్కను తింటున్నాయి.

యింకొక పెద్ద కుక్క వచ్చి, ఆ ముక్కని లాక్కుపోవటానికి, ఎదురు చూస్తూ, నాలిక బయటపెట్టి, రొప్పుతూ, ముందుకు దూకుతున్నది.

తల్లి కుక్క, ఆ పెద్ద కుక్కని తరుముతూ, అరుస్తూ, దాన్ని దగ్గరకు రానీయకుండా చూస్తున్నది.

కుక్క పిల్లలు మాత్రం తలలు ఎత్తకుండా కడుపు నింపుకుంటున్నాయి.

కష్టపడి సంపాదించి తెచ్చిన ఆహారాన్ని, తన పిల్లలకు యిచ్చి, వాళ్లు తింటూంటే, ఆ కష్టార్జితాన్ని, చెడ్డ కుక్కల నించీ, ఊర కుక్కల నించీ, పిచ్చి కుక్కల నించీ కాపాడుకోవలసిన 'హక్కు' ఆ తల్లి కుక్కకు వుంది మరి.

☆ ☆ ☆

"ఏమిటి నీ కథలో సందేశం? మన హక్కులు మనం సరిగ్గా కాపాడుకోవటంలేదని, కుక్కలకు వున్న బాధ్యత మనుష్యులకు లేదని ఎత్తిపొడుస్తున్నావా?" అడిగాడు రచయిత ఆత్మ, అద్దంలో తల దువ్వుకుంటున్న రచయిత శరీరంలో నించి ప్రక్కకు వచ్చి. (ఎప్పుడో ముప్పయి ఏళ్ల క్రితం ఒక తెలుగు సినిమాలో నాగేశ్వర్రావ్ ఆత్మ యిలాగే మాట్లాడేది).

"కాదు - మన హక్కులు మనం కాపాడుకోలేకపోతే, మనకు మిగిలేది సివిక్‌సెన్స్ మీద వుమ్మేసిన చెత్త, లంచగొండి ప్రభుత్వోద్యోగుల దౌర్జన్యం, రోడ్డు మీద పాయిఖానాలు, కుల రాజకీయాలతో దేశ వినాశనం, వినియోగదారుల అసహాయిత. కనీసం యిప్పటికయినా నిద్రలేస్తే హాయిగా బ్రతకవచ్చు!"

అద్దంలో ఆత్మ అంతర్ధానమయింది.

☆

☆